


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — PEN POWER TELUGU DAILY — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 29 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 4 అక్టోబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 29 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE FRI 4 OCTOBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada,Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur



# సనాతన ధర్మం కోసం ప్రాణాలైనా ఇస్తా...

- తిరుపతిలో వారాహి సభ
- హాజరైన పవన్ కల్యాణ్
- మన దేశ మూల సంస్కృతికి శ్రీరాముడు వెన్నెముక అని వ్యాఖ్యలు
- గతంలో సనాతన ధర్మం వైరస్ అంటూ ఉదయనిధి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం

## రాముడు ఉత్తరాది దేవుడా? మన దేవుడు కాదా?: పవన్ కల్యాణ్

ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కల్యాణ్ తిరుపతిలో వారాహి సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగం వాడీవేడిగా సాగింది. యావత్ దేశం శ్రీరాముడ్ని పూజిస్తుందని అన్నారు. కానీ శ్రీరాముడ్ని పాదరక్షలతో కొట్టి ఊరేగిస్తుంటే మనం చూస్తూ ఊరుకుందామా? గదుల్లో కూర్చుని ఏడుద్దామా? అని ప్రశ్నించారు. రామతీర్థంలో రాముడి తలనరికేస్తే ఏం చేశాం?... లోలోపలే తిట్టుకున్నాం... ఎందుకంటే, మన మాటలు ఎవరన్నా వింటే మనల్ని మతోన్మాదులు అనుకుంటారని భయం... అంటూ తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించారు. రాముడు ఉత్తరాది దేవుడు, ఆర్యుడు అనే తప్పుడు సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళుతుంటారు... మనం భయంతో మాట్లాడం... ఈ దేశ మూల సంస్కృతికి వెన్నెముక శ్రీరాముడు. రాముడు ఉత్తరాది దేవుడా? మనందరి దేవుడు కాదా? రాముడు ఏ ఛాయలో ఉంటాడు... నీలమేఘచ్ఛాయలో ఉంటాడు, కృష్ణుడు నీలమేఘచ్ఛాయలో ఉంటాడు,

వివరాలు 2లో..


## సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్రపై ఈడీ కేసు



పెన్ పవర్ డెస్క్:మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూ కుంభకోణానికి సంబంధించిన సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన కుమారుడు డాక్టర్ యతీంద్ర సిద్ధరామయ్య ప్రయత్నిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదుపై ఈడీ కేసు నమోదైంది. 14 స్థలాలకు సంబంధించిన కీలకమైన సాక్ష్యాలను ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేయడంలో సీఎం సిద్ధరామయ్య, ఆయన కుమారుడి ప్రమేయం ఉందని ప్రదీప్ కుమార్ అనే వ్యక్తి ఈడీకి ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ముడా కుంభకోణంపై

వివరాలు 2లో..

## అన్నీ తెలిసే నెయ్యి కాంట్రాక్టు ఇచ్చారు... ఇవిగో ఆధారాలు!



- వెంకటేశ్వరస్వామి లడ్డూ వివాదం
- ఏఆర్ ఫుడ్స్ సరఫరా చేసిన నెయ్యి మొత్తం కల్తీనే అంటూ పట్టాభి ఆరోపణలు
- ఆ సంస్థకు రూ.31.98 కోట్ల కాంట్రాక్టు ఇచ్చారని వెల్లడి
- కల్తీ నెయ్యి వెనుక ఎవరి హస్తం ఉందో నిగ్గు తేల్చేందుకు సిట్ వేశామని స్పష్టీకరణ


వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి సంపదను దోచుకునేందుకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం టీటీడీని జంతువుల కొవ్వుతో కలిసిన కల్తీ నెయ్యితో అపవిత్రం చేసిందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా చేసిందని తెలుగుదేశంపార్టీ జాతీయ అధి కార ప్రతినిధి

## తిరుమల లడ్డూ వివాదంపై నేడు సుప్రీంకోర్టులో విచారణ

- శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగం
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన వైవీ సుబ్బారెడ్డి, తదితరులు
- సుప్రీం పర్యవేక్షణలో విచారణ జరగాలన్న బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి
- ముఖ్యమైన కేసు విచారణ ఉందన్న సొలిసిటర్ జనరల్
- లడ్డూ కేసును రేపు విచారించాలని సుప్రీంకు విన్నపం
- సొలిసిటర్ జనరల్ విజ్ఞప్తిని మన్నించిన అత్యున్నత న్యాయస్థానం

వివరాలు 2లో..




## నేడు తిరుమల శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు దంపతులు



- అక్టోబరు 4న తిరుమల బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- తిరుమలలో సీఎం చంద్రబాబు రెండ్రోజుల పర్యటన
- పెద శేష వాహనం సేవలో పాల్గొననున్న చంద్రబాబు, భువనేశ్వరి

వివరాలు 2లో..

## ఈ నెల 7న సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన



- ఢిల్లీలో కేంద్రం పెద్దలను కలవనున్న చంద్రబాబు
- ప్రపంచబ్యాంకు ప్రతినిధులతోనూ సమావేశం
- అమరావతికి నిధుల సాయంపై చర్చ

పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 7న ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. హస్తినలో ఆయన

వివరాలు 2లో..

## కఠిన చర్యలు తీసుకోకపోతే ఒక తరాన్ని నష్టపోతాం

- హోంమంత్రి అనిత అధ్యక్షతన మంత్రుల ఉపసంఘం సమావేశం
- హాజరైన మంత్రి నారా లోకేశ్
- డ్రగ్స్ కట్టడిపై చర్చ



పెన్ పవర్ డెస్క్:సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో గంజాయి, ఇతర

వివరాలు 2లో..

## ఇంద్రకీలాద్రిపై వైభవంగా ప్రారంభమైన శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



- ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తజనం
- వేకువజామునే కనకదుర్గమ్మకు స్నపనాభిషేకం
- బాల త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ తల్లి

పెన్ పవర్ డెస్క్:కనకదుర్గమ్మ కొలువైన బెజవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజామునే జగన్మాతకు స్నపనాభిషేకం, ఇతర పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుండి అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రోజు నుండి 12వ తేదీ వరకూ

వివరాలు 2లో..

## వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించలేం

### సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్

- వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలని సుప్రీంకోర్టులో పిటిషన్లు
- ఈ పిటిషన్లను వ్యతిరేకించిన కేంద్ర ప్రభుత్వం
- అన్ని రాష్ట్రాలు, భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలన్న కేంద్రం



వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ప్రపంచాన్ని కుదిపేస్తున్న యుద్ధాలు

గెలుపు, ఓటమిలను పక్కన పెడితే.. యుద్ధం అనేది ఏ దేశానికి మంచిది కాదు. ఆర్థికంగా, సామాజికంగా యుద్ధం ఇరు దేశాలకు చేటే చేస్తుంది. ఎంత సైనిక బలం ఉన్న దేశమైనా ఎంతో కొంత నష్టపోవడం తప్పదు. ఇప్పటి వరకు ఓటమి ఎరుగని రష్యా సైతం ఉక్రెయిన్ పై ప్రకటించిన యుద్ధంతో కేవలం రెండు, మూడు రోజుల్లో ఉక్రెయిన్ రష్యా వశం అవుతుందని ప్రపంచం మొత్తం అనుకుంది. కానీ నెలలు గడుస్తున్నా రష్యా మాత్రం ఉక్రెయిన్ ను ఆక్రమించుకోలేకపోతుంది. ఇక ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య నిరంతర పోరాటం కోట్లాది మంది ప్రజలు, ఆస్తుల నాశనానికే తప్ప ఒరిగిందేమీ లేదు. ఇప్పటి వరకు ఏఏ దేశాలు యుద్ధం చేసుకుంటున్నాయి. ఏఏ దేశాలు యుద్ధం చేసుకునే అవకావం ఉందనే విషయం ఇక్కడ తెలుసుకుందాం.

**ఇజ్రాయెల్–ఇరాన్..**

ఇజ్రాయెల్ పై ఇరాన్ అక్టోబర్ 1న అప్మెలోన్ నుంచి 200 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అయితే ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ క్షిపణి నిరోధక వ్యవస్థ వాటిని అడ్డుకుంది. హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రుల్లా, ఇతర మద్దతు దారుల హత్యపై ఇరాన్ ఆకస్మిక ప్రతిస్పందన ఇది. నిర్ణయాత్మకంగా స్పందించేందుకు సరైన సమయం ఎంచుకుంటామని ఇజ్రాయెల్ సైనికాధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఇజ్రాయెల్ రక్షణకు సహకరించాలని, ఇరాన్ క్షిపణులను కూల్చివేయాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సైన్యాన్ని ఆదేశించినట్లు వైట్ హౌజ్ తెలిపింది. బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ వైట్ హౌజ్ నుంచి ఇరాన్–ఇజ్రాయెల్ దాడులను పర్యవేక్షిస్తున్నారు. భద్రతకు కట్టుబడి ఉన్నామని బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ ఇజ్రాయెల్ కు హామీ ఇచ్చారు. క్షిపణి మార్పిడి దృష్ట్యా, ఇరాన్–ఇజ్రాయెల్ సంప్రదాయ యుద్ధంగా వర్గీకరించబడనప్పటికీ అలా జరగడం లేదు. ఇరాన్, ఇజ్రాయెల్, పాలస్తీనా, ఉక్రెయిన్, రష్యా మాత్రమే యుద్ధంలో లేవు. ప్రస్తుతం ఎన్ని దేశాలు ఇతర దేశాలతో యుద్ధం చేస్తున్నాయో లేదా ప్రత్యక్ష సైనిక సంఘర్షణలలో పాల్గొంటున్నాయో తెలుసుకోండి.

**ఇజ్రాయెల్ వర్సెస్ పాలస్తీనా (గాజా వివాదం)**

గాజాలో ఇజ్రాయెల్, పాలస్తీనా మిలిటెంట్ గ్రూపుల మధ్య హింసాత్మక ఘటనలకు దారితీశాయి. ప్రాదేశిక వివాదాలు, జెరూసలేం స్థితి, ఇజ్రాయెల్ ఆక్రమణ, దిగ్బంధాలకు పాలస్తీనా ప్రతిఘటన, ప్రతిస్పందనగా గాజా నుంచి హమాస్ రాకెట్ దాడులు, ఇజ్రాయెల్ వైమానిక దాడులు వంటి కాలానుగుణ పెరుగుదలతో సంఘర్షణ మొదలైంది. 2024, అక్టోబర్ 1న ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్లోని తుబాస్ వద్ద ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన తర్వాత పాలస్తీనియన్లు ఒక క్షిపణిపై దర్యాప్తు చేస్తున్నారు.

**ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్..**

హిజ్బుల్లా అధినేత హసన్ నస్రుల్లా హత్యకు ప్రతీకారంగా ఇరాన్ 2024, అక్టోబర్ 1న ఇజ్రాయెల్ పై 200 క్షిపణులను ప్రయోగించింది. ఇజ్రాయెల్ ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమవుతోంది. ఇరాన్ నుంచి ప్రయోగించిన క్షిపణి సెంట్రల్ ఇజ్రాయెల్ లోని ఓ పాఠశాల భవనాన్ని ఢీకొట్టిన ప్రదేశాన్ని ఇజ్రాయెల్ రెస్క్యూ ఫోర్స్ సభ్యులు పరిశీలించారు.

**రష్యా వర్సెస్ ఉక్రెయిన్**

ఉక్రెయిన్ ను పూర్తిగా ఆక్రమించుకునేందుకు రష్యా 2022లో యుద్ధం ప్రకటించింది. తూర్పు ఉక్రెయిన్ లో యుద్ధాలు కొనసాగుతున్నాయి. 2022లో ఉక్రెయిన్ పై రష్యా ఆక్రమణ ఉక్రేనియన్ భూ భాగంపై నియంత్రణను సాధించేందుకు, ఉక్రెయిన్ నాటో, పశ్చిమ దేశాలతో సంబంధాలను కట్ చేయడమే ఈ యుద్ధంకు కారణం. ఉక్రెయిన్ లోని జపోరిజ్జియాలో సెప్టెంబర్ 26, 2024 న రష్యా వైమానిక దాడిలో భారీగా దెబ్బతిన్న నివాస ప్రాంతంలో శిథిలాలను రెస్క్యూ సిబ్బంది తొలగించారు.

**సౌదీ వర్సెస్ యెమెన్ (హౌతీ తిరుగుబాటుదారులు):**

ఇతర గల్ఫ్ దేశాల మద్దతుతో సౌదీ నేతృత్వంలోని సంకీర్ణం యెమెన్ లోని హౌతీ తిరుగుబాటుదారులపై సైనిక చర్యను కొనసాగిస్తోంది. యెమెన్ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రభుత్వాన్ని పునరుద్ధరించేందుకు, ఉత్తర యెమెన్ లో ఎక్కువ భాగాన్ని నియంత్రించే ఇరాన్ మద్దతు గల హౌతీ తిరుగుబాటుదారుల ప్రభావాన్ని అరికట్టేందుకు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణం పోరాడుతోంది. 2024, సెప్టెంబరు 30 న యెమెన్ లోని హ్వాదైదాలోని ఎర్ర సముద్రం రేవు హ్వాదైదాలో ఇజ్రాయెల్ వైమానిక దాడులతో ధ్వంసమైన ఒక పవర్ స్టేషన్ శిథిలాలు.

**టర్కీ వర్సెస్ కుర్దిష్ గ్రూప్స్ (పీకేకే)**

కుర్దిస్థాన్ వర్కర్స్ పార్టీ (పీకేకే), సంబంధిత సమూహాలకు వ్యతిరేకంగా టర్కీ సైనిక చర్యలను కొనసాగిస్తోంది, సిరియా, ఇరాక్ లో సీమాంతర చర్యలతో. టర్కీలోని కుర్దిష్ ప్రాంతాలకు స్వయంప్రతిపత్తి లేదా స్వాతంత్ర్యం కోరుకునే పీకేకే వంటి కుర్దిష్ తిరుగుబాటు సమూహాలను టర్కీ ఎదుర్కొంటోంది. ఇవి తరచుగా సిరియా, ఇరాక్ లోకి ప్రవేశిస్తున్నాయి. సిరియాలోని కుర్దిష్ ఆధీనంలోని ఈశాన్య నగరమైన ఖమిష్లీ నుంచి పొగలు వెలువడుతున్నాయి.

**అజర్ బైజాన్ వర్సెస్ ఆర్మేనియా**

2023లో అజర్ బైజాన్ ప్రాంతంపై ఆర్మేనియా పూర్తి నియంత్రణను తిరిగి పొందడంతో ఘర్షణ పెరిగింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తర్వాత ఇరు దేశాలు వాదిస్తున్న వివాదాస్పద నగోర్నో–కరాబాఖ్ ప్రాంతంపై వివాదం ఉంది, ఇది అప్పుడప్పుడు ఇరు దేశాల మధ్యతీవ్రతకు దారితీస్తుంది. అజర్ బైజాన్ విదేశాంగ మంత్రి జైహున్ బైరమోవ్ (ఎల్), ఆర్మేనియా విదేశాంగ మంత్రి అరరాత్ మిర్జోయాన్ (ఆర్), కజకిస్తాన్ విదేశాంగ మంత్రి మురాత్ నూర్ట్లు కజకిస్తాన్ లోని అల్మాటీలో శాంతి చర్చలకు ముందు మే 10, 2024 న సమావేశమయ్యారు.

**ఇథియోపియా వర్సెస్ ఎరిత్రియా (టిగ్రే వివాదం)**

ఇథియోపియాలో టిగ్రే సంఘర్షణ తగ్గినప్పటికీ, ఇథియోపియా దళాలు మరియు ఎరిత్రియా మధ్య ఉద్రిక్తతలు, అప్పుడప్పుడు సరిహద్దు ఘర్షణలు కొనసాగుతున్నాయి. ప్రత్యేకించి ఎరిత్రియా దళాలు టిగ్రే ఘర్షణలో పాల్గొన్నందున. టిగ్రేలో జరిగిన యుద్ధంలో ఎరిత్రియా టిగ్రాయన్ తిరుగుబాటుదారులకు వ్యతిరేకంగా ఇథియోపియా దళాలకు మద్దతు ఇచ్చింది. అడపాదడపా పోరాటాలు జరుగుతున్నాయి. ఎరిత్రియా, ఇథియోపియా దళాలు ఫ్రంట్ లైన్ స్థానాల నుంచి వెనక్కి వెళ్లి 25 కిలో మీటర్ల వెడల్పు, తాత్కాలిక భద్రతా జోన్ ను 4,000 మంది ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షకుల నియంత్రణలో ఏర్పాటు చేశాయి. మే, 1998 నుంచి జూన్, 2000 వరకు ఎరిత్రియా, ఇథియోపియా మధ్య జరిగిన యుద్ధానికి ముగింపు పలకడంలో బఫర్ జోన్ ఒక ముఖ్యమైన దశ.

**సోమాలియా వర్సెస్ కెన్యా**

సోమాలియాలో అల్ షబాబ్ మిలిటెంట్లకు వ్యతిరేకంగా కెన్యా సైనిక చర్యల కారణంగా సోమాలియా, కెన్యా ఉద్రిక్తతలను ఎదుర్కొన్నాయి. సీమాంతర దాడులు అప్పుడప్పుడు సైనిక చర్యలకు దారితీస్తాయి. అల్–షబాబ్ మిలిటెంట్లను ఎదుర్కోవడానికి సోమాలియాలో కెన్యా సైనిక జోక్యం, అలాగే రెండు దేశాల మధ్య సరిహద్దు వివాదాలపై ఈ వివాదం ఎక్కువగా ఉంది.

# సనాతన ధర్మం కోసం ప్రాణాలైనా ఇస్తా...

- మొదటి పేజీ తరువాయి

కాళికాదేవి నల్లని రంగులో ఉంటుంది అని పవన్ వివరించారు. “సనాతన ధర్మానికి వర్ణ వివక్ష లేదు. ఇవన్నీ మెకాలే తీసుకువచ్చిన రంగులు. కుహనా లౌకికవాదులకు ఒకటే చెబుతున్నా... మీ సిద్ధాంతాలను మాపై రుద్దకండి. అయోధ్య రామ జన్మభూమిలో శ్రీరాముడి ప్రతిష్ఠాకార్యక్రమం జరుగుతుంటే దేశ ప్రతిపక్ష నేత 'నాచ్ గానా' కార్యక్రమం అని అవమానించారు... దీనిని ఏ హిందువు కూడా ప్రశ్నించరా? మన రాముడిపై వాళ్లు జోకులు వేస్తుంటే చూస్తూ కూర్చోవాలా? రామాయణం కల్పవృక్షం అంటే... కాదు, అది విషవృక్షం అన్నారు... మరి మాకు కోపాలు రావా?” అంటూ పవన్ ఆవేశపూరితంగా ప్రసంగించారు.

**తమిళంలో పవన్ ప్రసంగం... ఉదయనిధి స్టాలిన్ కు పరోక్ష హెచ్చరిక!**

సనాతన ధర్మానికి భంగం కలిగితే తాను బయటికి వచ్చి పోరాడతానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అవసరమైతే ప్రాణత్యాగం చేస్తానని, డిప్యూటీ సీఎం పదవి పోయినా భయపడబోనని, ధర్మాన్ని రక్షించడం కోసం దేనికైనా సిద్ధమేనని అన్నారు. తిరుపతిలో ఏర్పాటు చేసిన వారాహి సభలో పవన్ ప్రసంగించారు. తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పై పరోక్షంగా ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన తమిళంలోనూ, ఆంగ్లంలోనూ ప్రసంగించారు “సనాతన ధర్మం వైరస్ లాంటిదని, ఆ మహమ్మారిని నిర్మూలించాలని ఈ మధ్య ఓ యువ నాయకుడు మాట్లాడుతున్నాడు. సనాతన ధర్మాన్ని ఎవరూ ఏమీ చేయలేరు...ఎవరైనా సరే దాన్ని నిర్మూలించాలనుకుంటే, వారే తుడిచిపెట్టుకుని పోతారు... తిరుపతి బాలాజీ సాక్షిగా ఈ మాట చెబుతున్నా” అంటూ పవన్ హెచ్చరించారు. ఇక, సనాతన ధర్మంపై జరుగుతున్న దాడులను న్యాయస్థానాలు సమర్థిస్తున్నాయని, సనాతన ధర్మంపై దాడులు చేస్తున్న వారిని కోర్టులు కాపాడుతుండడం బాధాకరమని వ్యాఖ్యానించారు.

# వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించలేం

**పెన్ పవర్ డెస్క్:** వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే తగినన్ని శిక్షలు ఉన్నాయని, కానీ ఇది మాత్రం చట్టబద్ధమైన అంశానికి మించిన సామాజిక సమస్య అని పేర్కొంది. ఇది సమాజంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని వెల్లడించింది. ఈ అంశంపై ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు భాగస్వామ్య పక్షాలతో విస్తృతస్థాయిలో సంప్రదింపులు జరపాల్సి ఉందని తెలిపింది. అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఈ సమస్యపై (వైవాహిక అత్యాచారం) నిర్ణయాన్ని వెల్లడించలేమని కోర్టుకు కేంద్రం తెలిపింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసింది. వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలని సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లను కేంద్రం

వ్యతిరేకించింది. ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలోకి రాదని వెల్లడించింది. కేంద్రం, అన్ని రాష్ట్రాలు, ఇతర భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా దీనిపై ఓ నిర్ణయం తీసుకోలేమని వెల్లడించింది.

# నేడు తిరుమల శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు దంపతులు

**పెన్ పవర్ డెస్క్:** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రం ముస్తాబైంది. శ్రీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో, ఏపీ సీఎం చంద్రబాబు దంపతులు తేక్టోబరు 4) లాంఛనంగా స్వామివారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఎల్లుండి (అక్టోబరు 5)న కూడా చంద్రబాబు దంపతులు బ్రహ్మోత్సవాలకు హాజరుకానున్నారు. వారు పెద శేష వాహన సేవలో పాల్గొంటారు.

# అన్నీ తెలిసే నెయ్యి కాంట్రాక్టు ఇచ్చారు... ఇవిగో ఆధారాలు!

- మొదటి పేజీ తరువాయి

కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మండిపడ్డారు. మంగళగిరిలోని తెలుగుదేశంపార్టీ కేంద్ర కార్యాలయంలో ఇవాళ విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం టీటీడీకి కల్తీ నెయ్యిని సరఫరా చేసిందని ఆరోపిస్తూ, పలు కీలక డాక్యుమెంట్లను మీడియా ముందు పట్టాభిరామ్ ఉంచారు.

**ఇది క్షమించరాని పాపం!**

తిరుమల తిరుపతి దేవస్థానంలో గత ప్రభుత్వం క్షమించరాని పాపం చేసింది. అన్నీ తెలిసే వైసీపీ ఏఆర్ డెయిరీని అడ్డుపెట్టుకుని స్వామివారి ప్రసాదం లడ్డూ తయారీలో కలుషితమైన నెయ్యిని వాడారు. జంతువుల కొవ్వుతో కలిసిన నెయ్యిని వైసీపీ పాలకులు వాడి క్షమించరాని పాపం చేశారు. మరిన్ని ఆధారాలు నేడు ప్రజల ముందు ఉంచుతున్నాం. 10 లక్షల కిలోల స్వచ్ఛమైన ఆవు నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఏఆర్ ఫుడ్స్ కంపెనీకి వైసీపీ ప్రభుత్వం ఇచ్చింది. ఈ కాంట్రాక్టు విలువ రూ. 31.98 కోట్లు.

**ఒక్కరోజు ముందు అగ్రిమెంట్ చేసుకున్నారు**

మే 15 2024న వైసీపీ ప్రభుత్వం ఏఆర్ ఫుడ్స్ డెయిరీకి టీటీడీ పర్చేజ్ ఆర్డర్ ఇచ్చింది. టెండర్ పిలిచింది మార్చి 12న, ఫైనల్ చేసింది మే 8న, పర్చేజ్ ఆర్డర్ ఇచ్చింది మే 15న, అగ్రిమెంట్ చేసుకుంది జూన్ 11న.

చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకునే ఒక్కరోజు ముందు అగ్రిమెంట్ ను పకడ్బందీగా వైసీపీ ప్రభుత్వం చేసింది. 2023 నవంబర్ 8న ఒక టీటీడీ టెక్నికల్ టీమ్ ఏఆర్ ఫుడ్స్ కంపెనీ పరిశీలనకు వెళ్లింది. ఏఆర్ డెయిరీ సంస్థ 2022–2023 సంవత్సరానికి 14,940 కిలోలు(14.9టన్నులు) మాత్రమే బల్క్గా సరఫరా చేసినట్లు టెక్నికల్ టీమ్ నిర్ధారించింది. ఏఆర్ ఫుడ్స్ డెయిరీ కంపెనీ ఉత్పత్తి సామర్థ్యం నెలకు సుమారు 16 టన్నులు మాత్రమే. దీని ప్రకారం చూస్తే 6 నెలలకు దాదాపు 100 టన్నుల నెయ్యి మాత్రమే ఏఆర్ డెయిరీ ఉత్పత్తి చేయగలదు. కానీ 6 నెలల్లో టీటీడీకి వెయ్యి టన్నుల నెయ్యి సరఫరా చేసేందుకు ఏఆర్ డెయిరీకి కాంట్రాక్టు ఇచ్చారు.

**ఆ ట్యాంకర్లు ఎక్కడెక్కడ తిరిగాయి?**

ఏఆర్ డెయిరీ టీటీడీకి 8 ట్యాంకులు నెయ్యిని సరఫరా చేసింది. వాటిలో 4 ట్యాంకులు పంపితే దాన్ని వాడారు, మిగిలిన 4 ట్యాంకులను టీటీడీ వెనక్కి పంపించింది.

జూన్ 4, 2024న ఏఆర్ ఫుడ్స్ నుండి టీటీడీకి మొదటి నెయ్యి ట్యాంకర్ %ూా26ుజ%4779 దిండిగల్ నుండి బయలు దేరింది. ఈ లారీ జూన్ 12, 2024న తిరుమలలోని టీటీడీకి చేరింది. దిండిగల్ నుండి తిరుమలకు కేవలం 500 కిలోమీటర్ల దూరం మాత్రమే. ఈ దూరం ప్రయాణించడానికి 8 రోజుల ప్రయాణం పడుతుందా? 8 రోజుల పాటు ఈ లారీ ఎక్కడెక్కడ తిరిగి కల్తీ నెయ్యిని తీసుకువచ్చింది?

జూన్ 11న ఏఆర్ ఫుడ్స్ నుండి బయలుదేరిన 2వ నెయ్యి ట్యాంకర్ 20న (10రోజులకు) టీటీడీ ఇన్ గేటుకు చేరింది. 24 జూన్ 2024న స్టోరేజీ ప్లేస్ కు వెళ్లింది.

2024 జూన్ 19న మూడవ ట్యాంకర్ ఏఆర్ ఫుడ్స్ నుండి బయలుదేరి 2024 జూన్ 25న (7రోజులకు) టీటీడీకి చేరింది. జూన్ 27న బయలుదేరిన 4వ ట్యాంకర్, జూలై 4న(8 రోజులకు) ఇన్ గేట్ లోకి వచ్చింది. జూలై 12న స్టోరేజీ ప్రాంతానికి చేరింది.

ఏఆర్ ఫుడ్స్ కంపెనీ టీటీడీకి అవసరమైనంత నెయ్యి ఉత్పత్తి, సరఫరా చేసే సామర్థ్యం లేక, తమ ట్యాంకర్లను వివిధ ప్రాంతాలకు పంపి, కల్తీ నెయ్యిని ట్యాంకర్లలో నింపి, తిరుమలకు తీసుకొచ్చేందుకు 8 రోజుల సమయం పట్టిందా?

ఏఆర్ ఫుడ్స్ సరఫరా చేసిన కల్తీ నెయ్యి వెనుక ఎవరెవరి హస్తం ఉందో నిగ్గు తేల్చడానికే మా ప్రభుత్వం సిట్ వేసింది. సుప్రీం కోర్టు మార్గదర్శకాలతో సిట్ విచారణను వేగవంతం చేసి దోషులను కఠినంగా శిక్షిస్తాం... అని పట్టాభి స్పష్టం చేశారు.

# కఠిన చర్యలు తీసుకోకపోతే ఒక తరాన్ని నష్టపోతాం

- మొదటి పేజీ తరువాయి

మాదక ద్రవ్యాల నియంత్రణకు ఏర్పాటైన మంత్రుల ఉపసంఘం రెండో సమావేశం ఇవాళ సచివాలయంలో జరిగింది. హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ తో పాటు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, డీజీపీ ద్వారకా తిరుమల రావు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఇన్ విజిబుల్ పోలీసింగ్ పై దృష్టి సారించాలి: నారా లోకేశ్**

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని అన్నారు. “మాదక ద్రవ్యాలపై కఠినంగా వ్యవహరించకపోతే ఒక తరాన్ని నష్టపోతాం. గంజాయి దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం డోర్ టూ డోర్ క్యాంపెయిన్ చేపట్టాలి. గంజాయి సాగును అరికట్టడంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న గంజాయి విషయంలో ఆయా ప్రభుత్వాలతో సమన్వయం చేసుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానానికి ఏఐ అనుసంధానించి మెరుగైన ఫలితాలు రాబట్టాలి. విజిబుల్ పోలిసింగ్ తో పాటు ఇన్ విజిబుల్ పోలిసింగ్ పైనా దృష్టి సారించాలి. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న అత్యుత్తమ విధానాలపై అధ్యయనం చేయాలి.

గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో పాటు మహిళా పోలీసుల సేవలను కూడా వినియోగించుకోవాలి. కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు అవగాహన కలిగించేలా వీడియోల ప్రదర్శనకు చర్యలు చేపట్టాలి. యువగళం పాదయాత్రలో గంజాయి వల్ల ప్రజలు పడుతున్న బాధలు స్వయంగా చూశాను. మంగళగిరిలోనూ గంజాయి సరఫరాపై మహిళలు పెద్దఎత్తున ఫిర్యాదులు చేశారు. గంజాయి, డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు సెలబ్రిటీలను భాగస్వామ్యం చేస్తాం” అని నారా లోకేశ్ వివరించారు.

**ఏపీ యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ విధివిధానాలపై చర్చ**

గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ఏర్పాటు చేయనున్న ఏపీ యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ విధివిధానాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో

గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు చేపట్టిన చర్యలను ఈ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు వివరించారు. అమరావతిలో నార్కోటిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుతో పాటు 26 జిల్లాల్లో నార్కోటిక్ కంట్రోల్ సెల్స్ నెలకొల్పనున్నట్లు తెలిపారు. ఫిర్యాదుల కోసం 1908 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటుచేయనున్నారు.

# ఈ నెల 7న సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన

- మొదటి పేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కొందరు కేంద్ర మంత్రులను కలవనున్నారు. సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన సందర్భంగా ప్రపంచబ్యాంకు ప్రతినిధులతోనూ సమావేశం కానున్నారు. అమరావతికి నిధుల సాయంపై చర్చించనున్నారు. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తో భేటీ సందర్భంగా విశాఖ రైల్వే జోన్, పెండింగ్ ప్రాజెక్టులపై చర్చించనున్నారు.

# తిరుమల లడ్డూ వివాదంపై నేడు సుప్రీంకోర్టులో విచారణ

**పెన్ పవర్ డెస్క్:** తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగం వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లిన సంగతి తెలిసిందే. లడ్డూ వివాదంలో దాఖలైన పిటిషన్లపై రేపు (అక్టోబరు 4) విచారణ కొనసాగించనున్నారు. జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని బెంచ్ నేడు మరో కేసును విచారించాల్సి ఉండడంతో, లడ్డూ కేసును శుక్రవారం ఉదయం 10.30 గంటలకు వాయిదా వేశారు. ఇవాళ ఓ ముఖ్యమైన కేసు విచారణ ఉందని, లడ్డూ కేసు విచారణ కోసం ఆ కేసును ఆపడం సరికాదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం ధర్మాసనం ఇవాళ మరో కేసుపై విచారణ చేపట్టాలని నిర్ణయించింది. లడ్డూ కేసును రేపటికి వాయిదా వేసింది. లడ్డూ కల్తీ వ్యవహారంపై విచారణను సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరపాలంటూ ఇటీవల బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్ వేయడం తెలిసిందే. వైసీపీ రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కూడా ఈ వివాదంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై సెప్టెంబరు 30న విచారణ జరిపిన సుప్రీంకోర్టు తదుపరి విచారణను అక్టోబరు 3కి వాయిదా వేసింది. అయితే, నేడు ఓ కీలకమైన కేసు ఉన్నందున లడ్డూ వ్యవహారంపై విచారణ సాధ్యపడలేదు.

# ఇంద్రకీలాద్రిపై వైభవంగా ప్రారంభమైన శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

- మొదటి పేజీ తరువాయి

రోజుకో అలంకారంలో దుర్గమ్మ భక్తులను అనుగ్రహిస్తారు. భక్తుల కొంగుబంగారంగా పేరొందిన జగజ్జనని దర్శనానికి భక్తులు విశేషంగా తరలి వస్తున్నారు. దీంతో ఆలయం, పరిసర ప్రాంతాలు భక్తులతో సందడిగా మారాయి. దసరా ఉత్సవాల వేళ అంతరాలయ దర్శనాలను నిలిపివేశారు. ఈ ఉత్సవాల్లో నిత్యం లక్షకుపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుంటారని అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేశారు. దసరా ఉత్సవాల సందర్భంగా దాదాపు నాలుగున్నర వేల మంది పోలీసులను బందోబస్తుకు వినియోగిస్తున్నారు. ఆలయం వద్ద భక్తుల రద్దీని సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిశితంగా పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. మరో పక్క ఇంద్రకీలాద్రిపై భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఇతర వివరాలను భక్తులు తెలుసుకునేందుకు ప్రత్యేక యాప్ ను ఆలయ అధికారులు అందుబాటులోకి తీసుకుచ్చారు.

# సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్రపై ఈడీ కేసు

- మొదటి పేజీ తరువాయి

ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ ఎదుట హాజరై విచారణకు సంబంధించిన రికార్డుల వాంగ్మూలం ఇచ్చారు. ముడా కుంభకోణం కేసులో విచారణ ఎదుర్కొంటున్న సిద్ధరామయ్య ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందన్న నమ్మకం తనకు ఉందన్నారు. మైసూరులోని చాముండేశ్వరీ ఆలయ ప్రాంగణంలో దసరా ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. ప్రజలు, అమ్మవారి ఆశీస్సులు ఉన్నంత వరకూ తనను ఎవరూ ఏమీ చేయలేరని సీఎం పేర్కొన్నారు. తాను ఏ తప్పు చేయలేదని, తప్పు చేసి ఉంటే ఇంతకాలం రాజకీయాల్లో ఉడడం అసాధ్యమన్నారు.

# కొండ సురేఖ మాటలు చట్టవిరుద్ధం ఆమెపై కేసు వేస్తా

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు మతిభ్రమించి, పిచ్చికుక్క కరిస్తే మాట్లాడినట్టు ఉన్నాయని ప్రజాశాంతి పార్టీ కే ఏ పాల్ అన్నారు. ఆమె మాటలు చట్టవిరుద్ధం. ఇదే అమెరికా అయితే మిలియన్ డాలర్ల పరువు నష్టం దావా వేస్తారు. రాహుల్ గాంధీ ఒక వ్యాఖ్య చేస్తే ఆయన పార్లమెంటు సభ్యత్వమే పోగొట్టుకోవాల్సి వచ్చిందని అన్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో పోల్చితే కొండా సురేఖ వ్యాఖ్యలు 100 రెట్లు అభ్యంతరకరంగా ఉన్నాయి. ఆమెకు నోటీసులు ఇచ్చి డీజీపీ ఎందుకు అరెస్టు చేయలేదు? ఇప్పుడు సారీ చెప్తే.. హత్య చేసి సారీ చెప్పినట్టుగా ఉంది. సమంతకు ఎంత మనోవేదన, ఆవేదన ఉంటాయో ఊహించారా? కొండా సురేఖ రాజీనామా చేయాలి. 72 గంటల సమయం ఇస్తున్నా. లేదా తక్షణమే ఆమెను తొలగిస్తూ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలి. సమంత ఇంటికి, నాగార్జున ఇంటికి వెళ్లి క్షమాపణ చెప్పాలి. కాంగ్రెస్ పార్టీకి గర్వం ఎక్కువై నేతలు ఇలా వ్యవహరిస్తున్నారు. కళ్ళు నెత్తిమీద ఉన్నాయని అన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదానిని ఎందుకు కలిశారు? ఆ సమావేశంలో సునీల్ కనుగోలు ఎందుకు ఉన్నాడు? ప్రజలకు కూడా బుద్ధి లేదు. రూ. 5,000/– తీసుకుని ఓట్లు వేస్తున్నారు. ఇకనైనా ఓటర్లు ఆలోచనతో ఓటేసి కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలి. మార్పు రావాలి. కాంగ్రెస్ వద్దు అంటే మళ్ళీ కేసీఆర్, కేటీఆర్ అంటున్నారు జనం. మళ్లీ వాళ్లను ఎందుకు తీసుకురావాలి? అందరూ ఒకటే నని అన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే.. ప్రజాశాంతి పార్టీని గెలిపించాలి. లేదంటే ప్రజలే నష్టపోతారు. 60% ప్రజలు ఉన్న బీసీలకు నేనున్నాను. నాతో క్రిస్టియన్ మైనారిటీలు ఎలాగూ ఉన్నారు. 72 గంటల్లో రాజీనామా చేయకపోతే.. కొండా సురేఖ పై కేసు దాఖలు చేస్తా. రాహుల్ గాంధీ ఏఏ సెక్షన్ల ప్రకారమైతే తన పదవిని పోగొట్టుకున్నారో వాటిని మించి కొండా సురేఖపై కేసు నమోదు చేయాల్సి ఉంటుంది.

# అమరావతికి నిధుల వరదే



**విజయవాడ, అక్టోబరు 3, పెన్ పవర్:** అమరావతి నిర్మాణంపై తీపికబురు అందింది. ఐదేళ్లుగా నిలిచిపోయిన అమరావతి నిర్మాణ పనులకు ఊతమిచ్చేలా ప్రపంచ బ్యాంక్, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ కన్సార్షియం నుంచి కేంద్ర ప్రభుత్వ హామీతో రుణాన్ని మంజూరు చేయడానికి సమ్మతి తెలిపాయి. గత ఐదేళ్లుగా అమరావతి పనులు నిలిచిపోవడంతో పాటు అంతకు ముందు చేపట్టిన పనులకు సంబంధించి దాదాపు రూ.9వేల కోట్ల మేర బిల్లులు బకాయి చెల్లించాల్సి ఉంది.2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఒక్కసారి అమరావతి పనులు నిలిచిపోయాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనుల పునరుద్ధరణ ప్రయత్నాలు ప్రారంభించారు. కేంద్ర బడ్జెట్‌లో అమరావతికి నిధులు గ్యారంటీగా ఇస్తామని నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. గతంలో ప్రపంచ బ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకులు అమరావతి నిర్మాణానికి రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అవసరం లేదని లేఖ రాయడంతో వాటిని ఉపసంహరించుకున్నాయి.రాష్ట్రంలో టీడీపీ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతంలో మంజూరు చేసిన రుణం కోసం ప్రయత్నాలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వం కూడా గ్యారంటీగా ఉండటానికి సుముఖత తెలుపడంతో రుణం మంజూరు అంశం కొలిక్కి రానుంది. మరి కొద్ది రోజుల్లో ఆ ప్రక్రియ కొలిక్కి రానుంది. 2025 జనవరి నుంచి అమరావతి నిర్మాణ పనులను ప్రారంభించేందుకు సిఆర్‌డిఏ సిద్ధం అవుతోంది.రాజధాని నిర్మాణం కోసం రూ. 15,000 కోట్ల రుణం ఇచ్చేందుకు వరల్డ్ బ్యాంక్, ఏడీబీ కన్సార్షియం ఆమోదం తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చాయి. మొత్తం రూ.15 వేల కోట్లూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే సీఆర్డీఏకి అందుతాయని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు.అమరావతి మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా మౌలిక వసతుల అభివృద్ధి, రాజధాని నిర్మాణం కోసం భూ సమీకరణలో భూములిచ్చిన రైతులకు కేటాయించిన లేఅవుట్లను అభి వృద్ధి చేయడం, పరిపాలన నగరంలో శాసనసభ, హైకోర్టు, సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయ భవనాల టవర్ల నిర్మాణం వంటి పనులకు రూ.49 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ఈ మేరకు సవరించిన అంచనాలను సీఆర్డీఏ ఇటీవల సిద్ధం చేసింది. పాతబాకీలు కూడా భారీగా చెల్లించాల్సి ఉంది. ఇందులో రూ.15 వేల కోట్లను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే విడుదల కానున్నాయి. ఇప్పటికే టెండర్ల ప్రక్రియను సిఆర్‌డిఏ ప్రారంభించింది.ఏడీబీల నుంచి మంజూరైన రుణం విడుదల కోసం కావాల్సిన ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించారు. ప్రపంచబ్యాంకు బృందం మూడు నాలుగు దఫాలుగా రాజధానిలో పర్యటించింది. ఢిల్లీలో కేంద్ర ఆర్థికశాఖ, ప్రపంచబ్యాంకు, సీఆర్డీఏ అధికారులతో కీలక సమావేశం ముగిసింది. నవంబరు 8న తుది సమావేశం జరుగుతుంది. నవంబర్ 15 నాటికి ఒప్పందాలు పూర్తవుతాయి. ఈ ప్రక్రియ పూర్తయితే రూ.15 వేల కోట్లు మంజూరైనట్టేనని అధికారులు చెబుతున్నారు.రుణం మంజూరుపై ఒప్పందం కుదిరిన వెంటనే మొత్తం రుణంలో 25%గా . రూ.3,750 కోట్లు అడ్వాన్స్ రూపంలో అందుకోవచ్చు. డిసెంబర్ నాటికి ఈ నిధులు అందుతాయని అంచనా వేస్తున్నారు.ప్రపంచ ఆర్థిక సంస్థల నుంచి రుణంగా తీసుకునే మొత్తంలో 90 శాతం కేంద్రమే భరిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. బడ్జెట్ ప్రకటనలో కేంద్రం ఇచ్చే సాయాన్ని గ్రాంటుగా పేర్కొనకపోవడం వివాదాస్పదం అయ్యింది. ఆ తర్వాత నిర్మలా సీతారామన్ వివరణ ఇచ్చారు. కేంద్రం ప్రత్యేక ప్యాకేజీ రూపంలో ఈ నిధులను అయా సంస్థల ద్వారా ఇస్తోంది.ప్రపంచ బ్యాంక్ రుణంపై 15 ఏళ్లపాటు మారటోరియం ఉంటుంది.ఇందుకు చెల్లించే వడ్డీ కూడా 4%లోపే ఉంటుంది. ఆ రుణంలో కేంద్రప్రభుత్వం 90%, రాష్ట్రప్రభుత్వం 10% చొప్పున భరించాల్సి ఉంటుంది. రాష్ట్రప్రభుత్వం చెల్లించాల్సిన 10% నిధుల్లో రూ.1500కోట్లను కూడా కేంద్రం వేరే నిధుల నుంచి సర్దుబాటు చేస్తుందని ఆర్థికశాఖ చెబుతోంది. సవరించిన అంచనాలతో టెండర్లు పిలిచి డిసెంబర్-జనవరి నుంచి అమరావతి పనులను పట్టాలు ఎక్కించేందుకు రెడీ అవుతున్నారుఅమరావతి మాస్టర్ ప్లాన్ లో భాగంగా మౌలిక వసతుల అభివృద్ధి, రాజధాని నిర్మాణం కోసం భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు కేటాయించిన లేఅవుట్లను అభివృద్ధి చేయడం,శాసనసభ, హై కోర్ట్,సచివాలయం విభాగాధిపతుల కార్యాలయాలతో పాటు నవ నగరాలు నిర్మించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే దాదాపు 50 వేల కోట్ల రూపాయలు దీనికి అవసరం. ఇప్పటికే దీనిపై సీఆర్డీఏ అంచనాలు రూపొందించింది.పాత బకాయిలు కూడా చెల్లించాల్సి ఉంది. అయితే నిధుల సమీకరణలో ఉండగా కేంద్రం ఈ నిధులను సర్దుబాటు చేయడంతో అమరావతి నిర్మాణ పనులు ఊపందుకొనున్నాయి. ఎప్పటికీ కొన్ని నిర్మాణాలకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా ప్రారంభమైంది.తాజాగా ప్రపంచ బ్యాంకు నుంచి మంజూరైన రుణం విడుదల కోసం కావాల్సిన ప్రక్రియను ప్రారంభించారు. ప్రపంచ బ్యాంకు బృందం నాలుగుసార్లు అమరావతిని సందర్శించింది.ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రపంచ బ్యాంక్, సి ఆర్ డి ఏ అధికారులతో గురువారం కీలక సమావేశం జరుగుతుంది. నవంబర్ 8న తుది సమావేశం జరగనుంది. నవంబర్ 15 నాటికి ఒప్పందాలు పూర్తవుతాయి. ఈ ప్రక్రియ పూర్తయితే 15 వేల కోట్లు మంజూరైనట్టేనని అధికారులు చెబుతున్నారు. రుణ మంజూరు పై ఒప్పందం కుదిరిన వెంటనే మొత్తం రుణంలో 25% అంటే.. 3750 కోట్లు అడ్వాన్స్ రూపంలో అందుకోవచ్చు. డిసెంబర్ నాటికి ఈ నిధులు అందుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అదే సమయానికి అమరావతి నిర్మాణ పనులు మొదలు పెట్టాలని ఇదివరకే లక్ష్యంగా పెట్టుకున్నారు.

## స్కామ్ లపై సీఐడీ విచారణలే




**విజయవాడ, అక్టోబరు 3, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు పూర్తయింది. వంద రోజుల పాలనలో మంచి చేశామని మనది మంచి ప్రభుత్వం అని ప్రచారం కూడా చేసుకున్నారు. కానీ సొంత పార్టీ కార్యకర్తల్లో మాత్రం అసంతృప్తి పెరిగిపోయిందన్న ఫీడ్ బ్యాక్ వచ్చింది. దాంతో దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో వేధించిన వారిపై చర్యలు తీసుకునేందుకు పకడ్బందీ కార్యాచరణను ఖరారు చేసుకునేదిశగా ప్రభుత్వం రెడీ అయింది. నారా లోకేష్ రెడ్ బుక్ అమలు ప్రారంభమయిందని ప్రకటించారు. మరో వైపు చంద్రబాబు స్వయంగా ఈ కేసులపై సమీక్ష చేశారు. వైసీపీ హయాంలో మైనింగ్, మద్యం, ఇసుక సహా అనేక స్కాంలపై విచారణలు జరుగుతున్నాయి. ఇందులో గనుల శాఖ వెంకటరెడ్డిని అరెస్టు చేశారు. రెండున్నర వేల కోట్ల మేర అక్రమాలు జరిగాయని ఏసీబీ కేసులు పెట్టింది. ఇక మద్యం విషయంలో అతి పెద్ద స్కామని చెబుతోంది. ఇప్పటికే కేసులు పెట్టారు. ఎఫ్ఐఆర్ బయటకు రాలేదు. ఇక మైనింగ్ సహా ఇతర అంశాల్లో విచారణలు జరుగుతున్నాయి. హీరోయిన్ జెత్వానీ కేసులో లోతైన విచారణ జరిపి దారి తప్పిన అధికారుల్ని ఇంటికి పంపాలని నిర్ణయించుకున్నారు. అలాగే.. టీడీపీ హయాంలో తప్పుడు కేసులు పెట్టిన అధికారులపై కేసులు పెట్టేదిశగా సన్నాహాలు చేసుకుంటున్నారు. తమ హయాంలో కక్ష సాధింపులు ఉండవు కానీ.. తప్పు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదని చంద్రబాబు చెబుతున్నారు.ఈ ప్రకారం ఆధారాలు ఉన్న ప్రతి అంశంలోనూ కేసులు పెట్టాలని స్పష్టం చేశారు. ఈ మేరకు తమకు అందుతున్న సమాచారం, సాక్ష్యాల ఆధారంగా కేసులు పెట్టబోతున్నారు. కక్ష సాధింపులు అనే ఆరోపణలు రాకుండా జాగ్రత్తగా ఈ కేసుల్ని డీల్ చేయాలనుకుటున్నారు. అయితే చేసే ఆరోపణలు చేస్తూనే ఉంటారని వారిని మాత్రం నిర్లక్ష్యం చేయవద్దని చంద్రబాబు సూచించారు. అందుకే చాలా కేసుల విషయంలో ముందుగా సాక్ష్యాల సేకరణ చేస్తున్నారు. పూర్తి స్థాయిలో ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అరెస్టుల వంటి కార్యాచరణ చేపట్టనున్నారు. వైసీపీ హయాంలో అవినీతి వ్యవహారాలు, కేసుల విచారణను సాధారణ పోలీసు విభాగం దర్యాప్తు చేయడం వల్ల ఆలస్యం అవుతుంది కాబట్టి సీఐడీకి కేసులన్నీ బదలాయించాలని ప్రభుత్వం అనుకుంటోంది. ఇప్పటికే మదనపల్లి ఫైల్స్ కాల్చివేత అంశంపై దూకుడుగా సీఐడీ విచారణ జరిపింది. రెండు, మూడు రోజుల్లో ఇతర కీలక కేసుల్లోనూ సీఐడీ విచారణ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. అదే జరిగితే.. అధికారంలోకి వచ్చినా ఏమీ చేయడం లేదనుకుంటున్న అనేక మంది వైసీపీ నేతలకు గడ్డు పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## పెళ్లి కాని ప్రసాద్ లు జాగ్రత్త

**అనంతపురం, అక్టోబరు 3, పెన్ పవర్:** హిందూపురం మండలం రాచపల్లి గ్రామానికి చెందిన వేమారెడ్డికి 40 ఏళ్ళు వచ్చిన పెళ్లి సంబంధాలు కుదరడం లేదు. 40 ఏళ్ళు వచ్చినా పెళ్లి కాలేదన్న బెంగతో ఊరు కాని ఊరు వెళ్లి పెళ్ళిళ్ళ బ్రోకర్ల చేతిలో మోసపోయాడు. తన పెళ్లి చూడాలన్న తల్లిదండ్రుల కోరిక తీర్చేందుకు భీమవరం పెళ్లిళ్ల బ్రోకర్ల ద్వారా భీమవరం పట్టణంలోని సత్యవతి నగర్‌కు చెందిన నీలపు బాల అనే మహిళతో పెళ్లి సంబంధం కుదుర్చుకున్నాడు. ఏజ్ ఎక్కువ అవ్వడంతో ఎదురు కట్నం ఇస్తే తప్ప పెళ్లి కుదరదని భీమవరం బ్రోకర్లు చెప్పడంతో? వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల ఇబ్బందులు చూడలేక వేమారెడ్డి పెళ్లికి ఒప్పుకున్నాడు.పెళ్లిచూపులు చూడటానికి వెళ్ళిన వేమారెడ్డిని బ్రోకర్లు 4 లక్షలు అప్పటికప్పుడే వసూలు చేసి? ఆగమేఘాల మీద ఓ గుడిలో వేమారెడ్డికి? నీలపు బాలకు పెళ్లి చేశారు. పెళ్లి చేసుకున్న తర్వాత వధువును తీసుకుని వేమారెడ్డి స్వగ్రామమైన రాచపల్లికి వచ్చాడు. పెళ్లి తర్వాత ఇంకేముంటుంది?. ఆ కార్యమే కదా.. తీరా కార్యం జరిపించాలని వేమారెడ్డి తల్లిదండ్రులు, బంధువులకు వధువు బాల లేనిపోని సాకులు చెప్పి వారం రోజులు కాలం వెళ్లబుచ్చింది.వారం తర్వాత తన తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగాలేదని వెంటనే భీమవరం వెళ్లాలని వధువు పట్టు పట్టింది. అదేంటి పెళ్లికి ముందు తల్లిదండ్రులు ఎవరూ లేరని చెప్పావు కదా అని వేమారెడ్డి నిలదీశాడు. దీంతో నవవధువు నీలపు బాల తనను తల్లిదండ్రుల దగ్గరికి పంపించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. సరే నీతో పాటు నేను వస్తానంటూ వేమారెడ్డి తన భార్య నీలపు బాలను తీసుకుని భీమవరం వెళ్ళాడు.తీరా భీమవరం రైల్వే స్టేషన్‌లో దిగిన తర్వాత అక్కడొక డ్రామా స్టార్ట్ చేసింది నీలపు బాల. తాను పెళ్లి చేసుకున్న విషయం తన తల్లిదండ్రులకు తెలియదని? ఇంటికి రావద్దని? అమ్మానాన్నలను చూసి తిరిగి వచ్చేస్తానంటూ హడావుడిగా నీలపు బాల ఆటో ఎక్కి వెళ్ళిపోయిందట. ఇంటికి తిరిగి వచ్చిన వేమారెడ్డి రోజులు గడుస్తున్న తన భార్య తిరిగి రాకపోవడం? ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్‌లో ఉండడం? పెళ్లి చేసిన బ్రోకర్ల ఫోన్లు స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో? భీమవరం వెళ్లి ఆరా తీస్తే? అసలు తాను చేసుకుంది పెళ్లే కాదని? ఉత్తుత్తి పెళ్లి జరిగిందని వేమారెడ్డి తెలుసుకున్నాడు. తనకు జరిగిన అన్యాయంపై బాధితుడు హిందూపురం రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పెళ్ళికాని ప్రసాద్‌లుగా అయినా ఉండొచ్చు గానీ తనలా బ్రోకర్ల ఉచ్చులో పడి ఉత్తుత్తి పెళ్లిళ్లు చేసుకొని మోసపోవద్దు బాధితుడు వేమారెడ్డి అంటున్నాడు

## దూరమైన సొంత సామాజిక వర్గం...

**కర్నూలు, అక్టోబరు 3, పెన్ పవర్:** న్నికల్లో జగన్ రెడ్డి సామాజిక వర్గం ఆదరించలేదా? అభిమానం ఉన్న జనాలతో ఓట్లు వేయించ లేదా? ఇంతటి ఓటమికి రెడ్డి సామాజిక వర్గమే కారణమా? అంటే అవుననే సమాధానం వస్తోంది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి లాంటివారు ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల అన్నాక గెలుపు ఓటములు సహజం. కానీ రెడ్డి సామాజిక వర్గం సుదీర్ఘకాలం కాంగ్రెస్ వెంట నడిచింది. రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. వైసీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచింది. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి సోషల్ ఇంజనీరింగ్ కు ప్రాధాన్యమిచ్చింది. బీసీ, ఎస్సీ, ఎస్టి, మైనారిటీలకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తూ వచ్చింది. అదే సమయంలో వైసీపీ ఉన్నతికి కృషి చేసిన రెడ్డి సామాజిక వర్గాన్ని మాత్రం పెద్దగా పట్టించుకోలేదు. చివరకు వారు ప్రాబల్యం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఎమ్మెల్యే, ఎంపీపీ, జడ్పిటిసి, చివరకు సర్పంచ్ పదవుల్లో సైతం వేరే సామాజిక వర్గాల వారికి కూర్చోబెట్టింది. అది అంతిమంగా రెడ్డి సామాజిక వర్గంలో ఆగ్రహానికి కారణమైంది. తమ వరకు ఓకే కానీ.. కేడర్ తో కానీ.. ప్రజలతో కానీ ఓటు వేయించేందుకు ఆ సామాజిక వర్గం నేతలు ఇష్ట పెట్టుకోలేదు. దాని ఫలితమే వైసీపీకి ఘోర పరాజయం.ఈ ఎన్నికల్లో 90 శాతం కమ్మ సామాజిక వర్గం టిడిపికి మద్దతు తెలిపింది. మద్దతు తెలపడమే కాదు స్వయంగా రంగంలోకి దిగింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కమ్మలు రంగంలోకి దిగి ఎలక్షన్ క్యాంపెయిన్ చేశారు. భారీగా నిధులు సమకూర్చారు. ఈసారి కానీ టిడిపి రాకుంటే కమ్మ సామాజిక వర్గం ఉనికి ప్రశ్నార్థకం అవుతుందని భయపడ్డారు. అందుకే తామే అభ్యర్థుల మన్న రీతిలో రంగంలోకి దిగారు. సామాజిక వర్గ పరంగా విభేదాలు ఉన్న కాపు సామాజిక వర్గాన్ని కలుపుకొని వెళ్లారు. కానీ ఆ స్థాయిలో రెడ్డి సామాజిక వర్గం పని చేయలేదు. 2019లో అదే పని చేసిన రెడ్డి సామాజిక వర్గానికి ఐదేళ్లపాటు ఎటువంటి న్యాయం చేయలేదు జగన్.సాధారణంగా రెడ్డి సామాజిక వర్గంలో నేతలు అధికం. ముఖ్యంగా రాయలసీమలో దశాబ్దాల పాటు రాజకీయ పునాది వేసుకున్నాయి కొన్ని కుటుంబాలు. అయితే జగన్ అధికారంలోకి వచ్చాక సోషల్ ఇంజనీరింగ్ పేరిట పెద్ద ఎత్తున బీసీలకు పదవులు ఇచ్చారు. ఎస్సీ ఎస్టీలకు సైతం అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అదే సమయంలో రిజర్వేషన్ల పేరిట రెడ్డిల ప్రాధాన్యత తగ్గించారు. దీంతో ఆ సామాజిక వర్గంలో నాయకత్వం తగ్గింది. నాయకత్వ పటిమను క్రమేపి తగ్గించేశారు. వైసీపీని గెలిపించేందుకు అహోరాత్రులు శ్రమించిన తమ విషయంలో.. జగన్ అలా ప్రవర్తించేసరికి రెడ్డి సామాజిక వర్గంలో ఒక రకమైన నిర్లిప్తత ప్రారంభమైంది. తమకు తాము వైసీపీ మద్దతు దారులుగా నిలిచినా.. క్యాడర్ తో పాటు ప్రజలను ఒప్పించేందుకు వారి మనసు అంగీకరించలేదు. అందుకే ఈ ఎన్నికల్లో రెడ్డి ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో సైతం వైసీపీకి వచ్చిన ఓట్లు అత్యల్పం.తాజాగా వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒక వ్యక్తి నాయకుడిగా 20 సంవత్సరాల శ్రమ ఉంటుందని అభిప్రాయపడ్డారు. అలాంటి నాయకుడికి సోషల్ ఇంజనీరింగ్ పేరుతో తప్పించి.. వేరే వారికి అప్పగిస్తే కచ్చితంగా బాధ కలుగుతుంది. అదే పెయిన్ రెడ్డి సామాజిక వర్గం నేతలు ఎదుర్కొన్నట్లు కేతిరెడ్డి చెప్పుకొచ్చారు. రాజకీయ ప్రాబల్యం కోల్పోయిన వారి పరిస్థితి దిగజారుతుందని.. ఆ పరిస్థితికి జగన్ ఆలోచనలే కారణం అన్నట్టు తప్పు పట్టారు కేతిరెడ్డి. మొత్తానికైతే జగన్ వైఫల్యాన్ని ఇప్పుడు రెడ్డి సామాజిక వర్గం ఎత్తిచూపుతుండడం విశేషం. దీని నుంచి అయినా జగన్ గుణపాఠాలు నేర్చుకుంటారో? లేదో? చూడాలి.

# పోలవరం పరుగులే...

**ఏలూరు, అక్టోబరు 3, పెన్ పవర్:** పోలవరం ప్రాజెక్టు పనులు 2026 మార్చికే పూర్తి చేయాలని కేంద్రం షరతు విధించడంతో ఈ ఆర్థిక సంవత్సరంలోనే పనులు, పునరావాసం వేగం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం రూ. 30,436,95 కోట్లతో తాజా డీపీఆర్ ను ఆమోదించింది. దీని వల్ల ఈ ప్రాజెక్టు తొలిదశ పూర్తికి రూ. 12,157 కోట్లు అందుబాటులోకి వచ్చాయి. తాజా డీపీఆర్ ఆమోదం తరువాత ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం కృషితో పోలవరానికి అడ్వాన్స్ గా నిధులిచ్చేందుకూ కేంద్రం ముందుకొచ్చింది. ఈ పరిస్థితుల్లో పోలవరం ప్రాజెక్టు పునరావాసానికి రూ. 5,500 కోట్లు, ప్రధాన డ్యాం కాలువల్లో నిర్మాణ పనులకు రూ. 1,700 కోట్ల వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో అవసరమని అధికారుల అంచనా వేశారు.ప్రాజెక్టు తొలిదశలో 41.15 మీటర్ల ఎత్తులో నీళ్లు నిలబెట్టాలి.. తొలిదశలో ఎనిమిది మండలాల పరిధిలో 172 నివాసాల్లో 38,060 మందికి పునరావాసం కల్పించాలి. ఇప్పటి వరకు 12,797 మందికి పునరావాసం కల్పించారు. ఇంకా 25,263 మందిని పునరావాస కేంద్రాల్లోకి తరలించాల్సి ఉంది. వీరికోసం 16,440 ఎకరాల భూమి సేకరించాలి. దీనికిగాను రూ. 2,435 కోట్లు అవసరం అవుతుంది. మరొకవైపు వీరందరికీ నిర్వాసిత ప్యాకేజీ కోసం రూ. 2,043.59 కోట్లు అవసరం అవుతుంది. అదేవిధంగా పునరావాస కాలనీల నిర్మాణానికి రూ. 3,314 కోట్లు కావాల్సి ఉంది. 2025 జూన్ నాటికి ఎంత వరకు చేయగలరో అంతవరకు చేయాలని కోరుతూ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. తక్షణం 5,500 కోట్లు కావాలంటూ ప్రతిపాదనల్లో పేర్కొన్నారుకొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులు నవంబర్ నెలలో ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఒప్పందాలు పూర్తయ్యాయి. కొత్త డయాఫ్రం వాల్ మట్టి సాంద్రత పెంపు.. ప్రధాన డ్యాం గ్యాప్-2లో పాత డయాఫ్రం వాల్ కు సమాంతరంగా కొత్త



డయాఫ్రం వాల్ నిర్మాణం కోసం దాదాపు 64వేల చదరపు మీటర్లు పని చేయాల్సి ఉంటుంది. కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం పనులు 2025 జూన్ నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. ఇందులో భాగంగా నవంబర్ నాటికి డిజైన్లు, ఇతర అంశాలపై చర్చలు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.ప్రధాన డ్యాం మొదటి రెండు గ్యాప్ లలో మట్టి సాంద్రత పెంచే పనులు చేయాల్సి ఉంది. అక్కడ ఇసుకను నింపి వైబ్రో కాంపాక్షన్ ద్వారా అక్కడ మట్టి గట్టిదనం పెంచాల్సి ఉంది. ఇందుకు షెడ్యూలు కూడా పోలవరం అథారిటీకి అధికారులు సమర్పించారు. అనుసంధాన పనుల్లో ఎడమ టన్నెల్ హెడ్ రెగ్యులేటర్, ఎడమ టన్నెల్ లైనింగ్, కుడి టన్నెళ్లలో మట్టి తవ్వకం లైనింగ్ కూడా 2025 జూన్ నాటికి పూర్తి చేసేలా షెడ్యూల్ చేశారు. ఇంకా తొలిదశలో ఆయకట్టు నీళ్లించేలా కుడి, ఎడమ కాలువల్లో కూడా పనులు చేయాల్సి ఉంది. ప్రధాన డ్యాం, కాలువల్లో నిర్మాణ పనులకు రూ.1700 కోట్ల వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో అవసరమని అధికారులు అంచనా వేశారు.

## మండలి సభ్యుల రాజీనామాలు ఆమోదం కష్టమే

**విజయవాడ, అక్టోబరు 3, పెన్ పవర్:** ఎమ్మెల్సీ రాజీనామా వ్యవహారంలో వైసీపీ వ్యూహం ఏంటి? నాన్చుడు ధోరణితో వ్యవహరించాలని చూస్తుందా? శాసనమండలి చైర్మన్ ద్వారా ఆధిపత్యం ప్రదర్శించాలని భావిస్తోందా? ఎట్టి పరిస్థితుల్లో శాసనమండలిలో టిడిపి కూటమి బలం పెరగకూడదని చూస్తోందా? పొలిటికల్ సర్కిల్లో ఇదే ఆసక్తికర చర్చ నడుస్తోంది. వైసీపీకి చెందిన పోతుల సునీత, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. వైసీపీకి సైతం గుడ్ బై చెప్పారు. ఎప్పుడో ఆగస్టులో తమ పదవులకు రాజీనామా చేస్తే ఇప్పటివరకు అవి ఆమోదం పొందలేదు. అందులో ఇద్దరు స్వయంగా మండలి చైర్మన్ మోసేన్ రాజుకు తమ రాజీనామా పత్రాలు సమర్పించారు. వ్యక్తిగత సమస్యలతోనే తాము పదవులకు రాజీనామా చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. కానీ ఎంతవరకు మండలి చైర్మన్ వాటిని ఆమోదించలేదు. అయితే ఉద్దేశపూర్వకంగానే ఇలా జాప్యం జరుగుతుందన్న అనుమానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పద్మశ్రీ సోమవారం మరోసారి మండలి చైర్మన్ మోసేన్ రాజును కలిశారు. తన రాజీనామాను ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. లేఖ కూడా రాశారు. అయినా సరే ఆమోదానికి నోచుకోలేదు. విశేషమేమిటంటే అదే వైసీపీకి ముగ్గురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేశారు. తమ రాజీనామాను రాజ్యసభ చైర్మన్ కు అందించారు. వెనువెంటనే ఈ రాజీనామాలు ఆమోదించారు రాజ్యసభ చైర్మన్. కానీ ఎమ్మెల్సీల విషయంలో మాత్రం భిన్నంగా జరుగుతుండడం విశేషం. కేవలం వైసీపీకి చెందిన మండలి చైర్మన్ ఉండడం వల్లే ఇలా జాప్యం చేయగలుగుతున్నారన్న టాక్ నడుస్తోంది.ఏపీలో కూటమి భారీ మెజారిటీతో గెలిచింది. వైసీపీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. 175 అసెంబ్లీ సీట్లకు గాను కూటమికి ఏకంగా 164 సీట్లు దక్కాయి. అటు పార్లమెంట్ స్థానాలను సైతం దాదాపు స్వీప్ చేసినంత పని చేసింది కూటమి. 25 సీట్లకు గాను 21చోట్ల కూటమి అభ్యర్థులు గెలిచి సత్తా చాటారు. వై నాట్ 175 అన్న నినాదంతో బరిలో దిగిన వైసీపీకి కేవలం 11 సీట్లు మాత్రమే వచ్చాయి. దీంతో ఆ పార్టీకి మైండ్ బ్లాక్ అవుతోంది. మరోవైపు ఎన్నికల అనంతరం వైసిపి నుంచి కీలక నేతలు బయటకు వస్తున్నారు. వీరిలో ఇంకా పదవీకాలం ఉన్న రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు ఉండడం విశేషం. అయితే ఇప్పుడు ఎమ్మెల్సీల రాజీనామాలు ఆమోదానికి నోచుకోకపోవడం హాట్ టాపిక్ అవుతోంది.శాసనమండలిలో వైసీపీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. ఆ పార్టీకి 38 మంది ఎమ్మెల్సీల బలం ఉంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కూటమి గెలిచినంత మాత్రాన వైసీపీకి పోయిందేమీ లేదని చెప్పుకొచ్చారు. శాసనమండలిలో 38 మంది, రాజ్యసభలో 11 మంది, శాసనసభలో 11 మంది, లోక్సభలో నలుగురు.. ఇలా కలుపుకొని వెళ్తే వైసీపీకి సైతం భారీగా ప్రజా ప్రతినిధులు ఉన్నారని.. ముఖ్యంగా శాసనమండలి ద్వారా టిడిపి కూటమి ప్రభుత్వాన్ని కట్టడి చేద్దామని ఎమ్మెల్సీలకు పిలుపు ఇచ్చారు. అయితే జగన్ నుంచి ఈ తరహా హెచ్చరిక రావడంతో టీడీపీ ప్రభుత్వం పాలు కదపడం ప్రారంభించింది. నేరుగా ఎమ్మెల్సీలను చేర్చుకోవడం కంటే.. వారితో రాజీనామా చేయించి.. ఖాళీ అయిన సీట్లను టిడిపి కూటమితో భర్తీ చేయాలన్నది ప్లాన్. అందులో భాగంగానే ముగ్గురు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. కానీ ఆ రాజీనామాలను ఆమోదించకుండా శాసనమండలి చైర్మన్ మోసేన్ రాజు అడుగడుగునా అడ్డు తగులుతున్నారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎమ్మెల్సీలను గెలుచుకోవడం వైసీపీకి జరగని పని. ఎందుకంటే ఆ పార్టీకి ఉన్న బలం కేవలం 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే. కూటమికి 164 సీట్లు ఉన్నాయి. వైసీపీ సభ్యుల రాజీనామాతో కూటమి ఈజీగా ఆ స్థానాలను గెలిచే ఛాన్స్ ఉంది. అందుకే కూటమి వ్యూహాత్మకంగా వైసీపీ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని చూస్తోంది. అయితే ఇలా చేస్తున్న రాజీనామాలను వైసీపీ అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. ఇందుకు మండలి చైర్మన్ మోసేన్ రాజును వాడుకుంటుంది. ఇలాగే ఆయన వ్యవహార శైలి నడిస్తే ప్రభుత్వం న్యాయ పోరాటం చేసి తగిన బుద్ధి చెప్పాలని చూస్తోంది. మొత్తానికైతే వైసీపీ ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారం ఇప్పుడు చర్చకు దారితీస్తోంది.

## దారి తప్పుతున్న టీచర్లు...

**అనంతపురం, అక్టోబరు 3, పెన్ పవర్:** చదువు బోధించాల్సిన ఉపాధ్యాయులు పక్కా దారి పడుతున్నారు. విద్యా బుద్దులు చెప్పి భావి భారత పౌరులను తీర్చి దిద్దే ఉపాధ్యాయులే అప్పులు చేసి పంగ నామం పెట్టి పరార్ అవుతున్నాడు. అనంతపురం జిల్లాలో వరుసగా జరుగుతున్న ఉపాధ్యాయుల అప్పుల ఎగ్గొట్టే ఘటనలు కలకలం రేపుతున్నాయి.చదువు బోధించాల్సిన ఉపాధ్యాయులు పక్కా దారి పడుతున్నారు. విద్యా బుద్దులు చెప్పి భావి భారత పౌరులను తీర్చి దిద్దాల్సిన ఉపాధ్యాయులు అప్పులు చేసి జనానికి పంగ నామం పెట్టి పరారతున్నారు. అనంతపురం జిల్లాలో వరుసగా జరుగుతున్న ఉపాధ్యాయుల అప్పుల ఎగ్గొట్టే ఘటనలు కలకలం రేపుతున్నాయి.తల్లిదండ్రుల తర్వాత అంతటి వారు ఉపాధ్యాయులు... తల్లిదండ్రులు పిల్లల్ని చక్క బెడతారో లేదో తెలియదు కానీ.. ఎంతో మంది పిల్లలకు చక్కటి చదువులు చెప్పి ఉన్నత శిఖరాల్లో కూర్చొబెట్టిన ఉపాధ్యాయులు ఎందరో. కానీ సమాజంలో నానాటికి ఆ వృత్తికి కలంకం తెస్తున్న ఉపాధ్యాయులు పెరిగిపోతూ ఉన్నారు. ఆడ పిల్లలపై అఘాయిత్యాలు చేస్తున్న ఉపాధ్యాయుల గురించి తరచూ వింటూ ఉన్నాం. ఇప్పుడు అప్పులు తీసుకొని ఎగ్గొట్టే ఉపాధ్యాయులు కూడా పెరిగిపోతూ ఉన్నారు. వినటానికి విడ్డూరంగా ఉన్నా ఇది నిజమే.అనంతపురం జిల్లాలో అప్పు తీసుకొని ఉపాధ్యాయులు అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్నారు. నిజానికి ఇది వినటానికి, చదవటానికి కాస్తంత వింతగా ఉన్నా పచ్చి నిజమే. బడి పంతులు అంటేనే గురు బ్రహ్మ గురు విష్ణు గురు దేవో మహేశ్వర అంటూ.. దేవుడి స్థానంలో ఊహించుకుంటున్న జనాలు వారు ఎక్కడికి పోతారన్న భరోసాతో అప్పు అడిగిన వెంటనే ఇచ్చేశారు.నెల నెల జీతం వచ్చే టీచర్ మన డబ్బు ఉంచుకుంటారా, సమయానికి చెల్లిస్తారు లే అనే నమ్మకంతో రూపాయి రూపాయి కూడబెట్టుకున్న డబ్బులు వారికి ఇస్తూ వచ్చారు. అయితే టీచర్లు దీన్ని బాగా అదునుగా తీసుకున్నారు. లక్షలకు లక్షలు అప్పులు తీసేసుకున్నారు.అనంతపురం జిల్లాలో ఇప్పటికే ముగ్గురు టీచర్లు ఇదే పని చేయగా తాజాగా విడపనకల్లు మండలంలోని హావలిగి జిఖూఊ పాఠశాల ఉపాధ్యాయుడు బద్రీనాథ్ ఐదు కోట్ల రూపాయలు అప్పులు ఉడాయించాడు. తీసుకున్న అప్పు డబ్బు ఎక్కడ అడుగుతారనో పాఠశాలలకు రావటం మానేశాడు. రెండు నెలలుగా పాఠశాలకు ఆ ఉపాధ్యాయుడు రాలేదని వాకబు చేయగా నిజమేనని తేలింది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు.టీచర్ బద్రీనాథ్.. జనం భద్రంగా దాచుకున్న డబ్బుపై కన్నేశాడు. తన తోటి ఉద్యోగులతోనా, గుంతకల్లులో నివాసం ఉంటున్న కాలనీ ప్రజలతో అప్పు తీసుకున్నాడు. ఏకంగా ఐదు కోట్ల రూపాయలకు పైగా అప్పుగా డబ్బు వసూలు చేసుకున్నాడు. ఆ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. తన పేరు మీద ఉన్న ఇంటిని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థకి అదే సమయంలో బ్యాంకుకు తాకట్టు పెట్టాడు.అదే సమయంలోనే తాకట్టు పెట్టిన ఇంటిని మరో వ్యక్తికి బాండుపై రాసిచ్చి రూ. 40 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అయితే దీనిపై బాధితులు పోలీసులను సైతం ఆశ్రయించారు. పోలీసులు విచారణ చేపట్టినట్టు తెలుస్తోంది. ఏది ఏమైనా అనంతపురం జిల్లాలో ఉపాధ్యాయులు అప్పుల బాగోతం స్థానికంగానే కాక రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీచర్లు పెను చర్చకు దారి తీసింది. బాధితులు కష్టపడి సొమ్ము టీచర్ల పాలైందని లబోదిబోమంటున్నారు.

# న్యూజిలాండ్‌తో భారత్ తొలి పోరు.. లైవ్ స్ట్రీమింగ్ ఎక్కడ చూడాలంటే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** విమెన్స్ టీ20 వరల్డ్‌కప్‌కు సర్వం సిద్ధమైంది. నేటి నుంచి యూఏఈలో జరిగే మెగా పోరులో టైటిలే లక్ష్యంగా ప్రతి జట్టు సర్వశక్తులు ఒడ్డేందుకు రెడీ అయ్యాయి. యూఏఈ వేదికగా జరుగుతున్న ఈ మెగాటోర్నీలో మొత్తం 10 జట్లు తలపడబోతున్నాయి. ఈ మెగా టోర్నీ 19 రోజుల పాటు అభిమానులను అలరించనుంది. సెమీస్ ఫైనల్లు, ఫైనల్ సహా మొత్తం 23 మ్యాచ్‌లు జరగనున్నాయి. నేడు తొలి మ్యాచ్ లో పాకిస్థాన్ తో శ్రీలంక తలపడుతుంది. భారత్ విషయానికి వస్తే రేపు న్యూజిలాండ్ తో తొలి మ్యాచ్ ఆడనుంది.

భారత్ ఉన్న గ్రూప్ లో పాకిస్థాన్, ఆస్ట్రేలియా, శ్రీలంక ఉంటున్నాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లు కఠిన ప్రత్యర్థులు అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సెమీస్ కు వెళ్లాలంటే టాప్ 2 లో నిలవాల్సిందే. ఇందులో భాగంగా ఆడే నాలుగు మ్యాచ్ ల్లో మూడు మ్యాచ్ లు గెలిచి తీరాల్సిన పరిస్థితి. అక్టోబర్ 6 న దాయాధి పాకిస్థాన్ తో తలపడుతుంది. 9న శ్రీలంక.. చివరి మ్యాచ్ 13 న ఆస్ట్రేలియా ఆడాల్సి ఉంది. ఈ సారి స్థాయికి తగ్గట్టుగా ఆడితే భారత్ ఫైనల్ కు వెళ్లడం ఖాయంగా కనిపిస్తుంది.

**లైవ్ లైవ్ స్ట్రీమింగ్ ఎక్కడ చూడాలంటే..?**

మహిళల టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు మన దేశంలో స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయబడతాయి. డిజిటల్ గా డిస్నీం హాట్‌స్టార్ యాప్, వెబ్‌సైట్‌లో లైవ్ ఆస్వాదించవచ్చు.

**టీ20 వరల్డ్ కప్ లో భారత్ ప్రదర్శన :**

2009లో మొదలైన ఈ టోర్నీలో ఇండియా ఎనిమిదిసార్లు బరిలోకి దిగింది. కానీ ఒక్కసారి కూడా కప్ కొట్టలేదు. 2020లో ఫైనల్‌కు చేరినా ఆసీస్ చేతిలో ఓడింది. లీగ్ మొత్తం అద్భుతంగా ఆడిన టీమిండియా టైటిల్ ఫైట్‌లో ఓడిన తీరు ఫ్యాన్స్‌ను ఆగ్రహానికి గురి చేసింది. 2009, 2010లో సెమీస్‌కు చేరిన ఇండియా 2012, 2014, 2016లో తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. 2018, 2023లో సెమీస్‌లో నిరాశపర్చింది.

**టీ20 వరల్డ్ కప్ కు భారత జట్టు:**

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, దయాళన్ హేమలత, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, రిచా ఘోష్, యాస్తిక భాటియా, పూజా వస్త్రాకర్, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్ ఠాకూర్, రాధా యాదవ్, ఆశా శోభన, ఎస్. సజన, శ్రేయాంక పాటిల్.

# వినేశ్ ఫొగాట్ నా తండ్రికి కనీసం థ్యాంక్స్ చెప్పలేదు: బబితా ఫొగాట్

### వినేశ్ ఫొగాట్ కెరీర్ కోసం నా తండ్రి ఎంతో చేశారన్న బబితా ఫొగాట్

### పారిస్ ఒలింపిక్స్‌లో అనర్హత వేటు పడినప్పుడు మహావీర్ ఏడ్చాడన్న కూతురు

### కానీ మొదటి గురువైన నా తండ్రికి థ్యాంక్స్ కూడా చెప్పలేదని ఆవేదన



**హైదరాబాద్ పెన్ పవర్:** పారిస్ ఒలింపిక్స్‌లో అధిక బరువు కారణంగా అనర్హత వేటుకు గురైన వినేశ్ ఫొగాట్‌పై ద్రోణాచార్య అవార్డు గ్రహీత మహావీర్ ఫొగాట్ కూతురు, మాజీ రెజ్లర్ బబితా ఫొగాట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వినేశ్ ఫొగాట్ పారిస్‌లో ఉండగానే రెజ్లింగ్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించారు. అయితే థ్యాంక్స్ నోట్‌లో చాలామంది పేర్లను ప్రసావించారు. కానీ తన పెదనాన్న, తన మొదటి గురువు మహావీర్ ఫొగాట్ గురించి పేర్కొనలేదు.ఈ అంశంపై బబితా ఫొగాట్ స్పందించారు. వినేశ్ ఫొగాట్ కెరీర్ కోసం తన తండ్రి మహావీర్ ఫొగాట్ ఎంతో చేశారని, కానీ ఆమె కనీసం కృతజ్ఞతలు తెలపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన జీవితంలో కేవలం మూడుసార్లు మాత్రమే తన తండ్రి ఏడవడం చూశానని గుర్తు చేసుకున్నారు.మొదటిసారి తన, తన సోదరీమణుల పెళ్లిళ్లు జరిగినప్పుడు, రెండోసారి మా బాబాయి చనిపోయినప్పుడు, మూడోసారి వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు పడినప్పుడు అని వెల్లడించారు. బాబాయి చనిపోయాక వినేశ్ ఫొగాట్, ఆమె సోదరీమణులు రెజ్లింగ్‌ను ఆపేశారని, కానీ నా తండ్రి వారి ఇంటికి వెళ్లి, వాళ్ల అమ్మకు నచ్చజెప్పి రెజ్లర్‌గా తయారు కావడానికి కృషి చేశారన్నారు.

# ఇదెక్కడి ట్విస్ట్.. రోహిత్, కోహ్లీలకు బంగ్లాదేశ్ క్రికెటర్ బ్యాట్ గిఫ్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా యంగ్ క్రికెటర్లకు స్టార్ ప్లేయర్లు బ్యాట్ ను గిఫ్ట్ గా ఇస్తూ ఉంటారు. బంగ్లాదేశ్ స్పిన్నర్ మెహదీ హసన్ మిరాజ్ మాత్రం టీమిండియా దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు బ్యాట్ ను బహుమతిగా ఇచ్చి షాక్ ఇచ్చాడు. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. భారత్, బంగ్లాదేశ్ మధ్య కాన్పూర్ వేదికగా ముగిసిన రెండో టెస్ట్ అనంతరం ఈ సంఘటన జరిగింది. అయితే అసలు విషయమేంటో ఇప్పుడు చూద్దాం. మెహిదీ హసన్ మాజీ బంగ్లాదేశ్ క్రికెటర్ ఇమ్రుల్ కయేస్, కొంతమంది స్నేహితులతో కలిసి ‘ స్పోర్ట్స్’ అనే బ్యాట్ కంపెనీని గత సంవత్సరం ప్రారంభించాడు. అక్టోబర్ 1న సిరీస్ ముగిసిన తర్వాత రోహిత్‌కి బహుమతి ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. అక్టోబర్ 1న సిరీస్ ముగిసిన తర్వాత రోహిత్‌కి బహుమతి ఇవ్వాలని బంగ్లా స్పిన్నర్ నిర్ణయించుకున్నాడు. అయితే అప్పటికే కోహ్లీ తన బ్యాట్ ను షకీబ్ కు గిఫ్ట్ గా ఇచ్చి క్రీడా స్ఫూర్తిని చాటుకున్నాడు. దీంతో కోహ్లీకి కూడా బ్యాట్ ను ఇవ్వాలనున్నాడట.

మిరాజ్ బహుమతిగా ఇచ్చిన బ్యాట్‌ను కోహ్లీ తీసుకొని బెంగాలీ భాషలో మాట్లాడాడు. “ఖూబ్ భలో అచీ (ఇది చాలా బాగుంది)” అని కోహ్లీ చిరునవ్వుతో మిరాజ్ కంపెనీ తయారు చేసిన బ్యాట్‌ను ప్రస్తావిస్తూ అన్నాడు. “మీకు శుభాకాంక్షలు. మంచి పని చేస్తూ ఉండండి.” అని చెప్పుకొచ్చాడు. మరోవైపు మెహదీ ఎప్పటి నుంచో రోహిత్ కు బ్యాట్ ఇవ్వాలని ఆరాటపడుతున్నాడట. తన కల నెరవేరిందని ఈ బంగ్లా స్పిన్నర్ తెలిపాడు. %బ్యాట్ తీసుకున్న రోహిత్ ఇలా స్పందించాడు “మెహిదీ నాకు చాలా కాలంగా తెలుసు. అతను చాలా మంచి క్రికెటర్. తన స్నేహితులతో కలిసి సొంతంగా బ్యాట్ కంపెనీని ప్రారంభించినందుకు నేను గర్విస్తున్నాను. నేను అతనికి అన్ని శుభాలు జరగాలని కోరుకుంటున్నాను. దేవుడు అతనికి విజయాన్ని ప్రసాదిస్తాడు. అతని సంస్థ అందరినీ మించిపోతుందని నేను ఆశిస్తున్నాను”. అని హిట్ మ్యాన్ తన విషెస్ తెలియజేశాడు.

**ఇటీవలి ఇన్‌స్టాగ్రామ్ చిత్రాలలో పింక్ చీరలను నెయిల్ చేసిన నటీమణులు**





# సెట్టయిన మాస్ రాజా.. ఇది అసలు మ్యాటర్

**హైదరాబాద్ పెన్ పవర్:** మాస్ మహారాజ్ రవితేజ ఇటీవల షూటింగ్ సమయంలో గాయపడి షోల్డర్ [illegible] చేయించుకున్న విషయం తెలిసిందే. ఈ గాయంతో రవితేజని డాక్టర్లు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. రవితేజ కూడా డాక్టర్ల సలహాని పాటించి నాలుగు వారాలు విశ్రాంతి తీసుకుంటున్నారు. అభిమానులందరూ ఆయన ఆరోగ్యం పట్ల మొదట ఆందోళన వ్యక్తం చేయగా ఒక పాత ఫొటో కూడా వైరల్ అయ్యింది. కానీ రవితేజకు ఆరోగ్య విషయంలో డౌట్ అక్కర్లేదని సన్నిహితులు క్లారిటీ ఇచ్చేశారు. ఇక జెట్ స్పీడ్ లోనే హాస్పిటల్ నుంచి ఇంటికి తిరిగి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇక రవితేజ కోలుకొని మళ్లీ సెట్స్‌కి వెళ్తున్నాడని మరో అప్‌డేట్ వచ్చింది. అక్టోబర్ 14వ తేదీ నుండి %=%75 సినిమా షూటింగ్‌కి రవితేజ హాజరవుతారని సమాచారం. కొంత గ్యాప్ తరువాత మళ్లీ సెట్‌లోకి రావడానికి రెడీ అవుతున్న మాస్ మహారాజ్‌కి ఈ ప్రాజెక్ట్ మీద చాలా హైప్ ఉంది. %ూశ్రీంశీ =ఝుః% – దేవర 2.. ఇలా అయితే ఎప్పుడు మరి? భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా అవుట్ అండ్ అవుట్ కమర్షియల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఉండబోతోందట. ధమాకా తరువాత శ్రీలీల ఈ చిత్రంలో రవితేజతో జతకట్టడం మరో విశేషం. ఇప్పటికే శ్రీలీల తన ఎనర్జిటిక్ పర్ఫార్మెన్స్‌తో యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంది. దీంతో ఈ క్రేజీ కాంబినేషన్‌కి ప్రేక్షకులు భారీగా ఎదురుచూస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఇప్పటికే చిత్రీకరణలో ఎక్కువ భాగం పూర్తయింది. రవితేజ గాయం కారణంగా మధ్యలో చిన్న బ్రేక్ వచ్చినా, అక్టోబర్ 14 నుండి మిగతా షెడ్యూల్‌కి ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ షూటింగ్ పూర్తయితే, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా మరింత వేగంగా పూర్తి కానున్నాయి. %ూశ్రీంశీ =ఝుః% – హీరోయిన్ డెడికేషన్ కు హ్యాట్సాఫ్..! అయితే మొదట సంక్రాంతి కానుకగా 2025 లో ఈ సినిమాను రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. కానీ షూటింగ్ షెడ్యూల్‌లో వచ్చిన మార్పుల కారణంగా, సినిమాను సంక్రాంతి సమయానికి రిలీజ్ చేయడం కుదరదని సమాచారం. మేకర్స్ కొత్త రిలీజ్ డేట్‌పై మరో ప్రకటన చేయనున్నారు. 2025 లో అనువైన మరో తేదీని అనుకుంటున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో రవితేజ పాత్రను పూర్తిగా కొత్తగా, ఎనర్జిటిక్‌గా డిజైన్ చేసినట్లు సమాచారం. మాస్ ఎంటర్టైనర్‌తో పాటు మంచి కామెడీ, యాక్షన్ అంశాలతో సినిమా ఉండబోతోందట. ఇదిలా ఉంటే రవితేజ నుంచి ఇటీవల వచ్చిన ఈగల్, మిస్టర్ బచ్చన్ సినిమాలు ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. కాబట్టి రవితేజ ఈ కొత్త ప్రాజెక్ట్ మీద చాలా ఆశలు పెట్టుకున్నాడు. అభిమానులు కూడా మాస్ మహారాజ్‌ను మళ్లీ సక్సెస్ ట్రాక్‌లో చూడాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి %=%75 సినిమా ఎలాంటి కంటెంట్ తో వస్తుందో చూడాలి.

**సాక్షి మాలిక్ ఈ డ్రెస్‌తో ఫ్యాషన్‌గా మారిపోయింది**



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com